

పేదలకు ఆహారాన్ని అందిస్తున్న నిర్వాహకులు

ఐదు రూపాయల భోజన కేంద్రం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కవాడిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)ఐదు రూపాయల భోజన కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఇందిరాపార్కు వద్ద ఉన్న భవనానికి తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో పనులు చేయిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు, హరే రామ హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 26న ఐదు రూపాయల భోజన భవనాల ప్రారంభమేది? పేరిట ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఈ ప్రాంతం వద్ద కేంద్రాన్ని ప్రారంభించి నిరుపేదలకు ఐదు రూపాయల భోజనాన్ని అందించారు. వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహేశ్‌కుమార్

ప్రభుత్వ స్థలాలను రక్షించాలి : మహేశ్‌కుమార్

ముషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ మహేశ్‌కుమార్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో గల 1-4-27/71/36 ఇంటి నంబర్ పక్కన గల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రామానుజరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. భూకబ్జా విషయంపై గతంలో కలెక్టర్, ఏఈ, సికింద్రాబాద్ ఆర్డీవో, విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ స్థలంలో ప్రజలకు ఉపయోగపడేలా ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఆయన వెంట బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిత్యానంద్, నగర కార్యదర్శి నాగేందర్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు జనక్‌రాజ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్.. ముగ్గురి అరెస్ట్

- రూ.2.48 లక్షల నగదు స్వాధీనం

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని హైదరాబాద్ సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకొంది. రెయిన్ బజార్, మూసారాంబాగ్, దోమలగూడ ప్రాంతాలకు చెందిన మహ్మద్ ఫిరాసత్ అలీ, నితిన్ కుమార్, వికాస్ అగర్వాల్ రాజస్థాన్‌కు చెందిన బుకీ పవన్ నుంచి యూజర్ ఐడీ తీసుకొని పలు సైట్లలో క్రికెట్ ఆడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్ఐలు కె.నర్సింహులు, ఎం.మహేష్, జి.ఆంజనేయులు, ఎస్.నవీన్ దాడులు చేసి బెట్టింగ్ ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం చిక్కడపల్లి పోలీసులకు అప్పగించారు. వారి నుంచి రూ.2.48 లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అత్తింటి వేధింపులతో నవవధువు ఆత్మహత్య

- బిల్డింగ్‌పై నుంచి దూకి బలవన్మరణం



సౌజన్య (ఫైల్)

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వేధింపులు భరించలేక నవవధువు భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ముషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోలక్‌పూర్‌లో నివాసం ఉంటున్న సౌజన్య (26)కు మూసాపేటలో నివాసం ఉంటున్న జిమ్ నిర్వాహకుడు ఎ.షబారీష్‌తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. ఆమె గుండెకు రంధ్రం ఉన్న విషయాన్ని ఎందుకు చెప్పలేదని భర్తతో పాటు అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారు. ఇవి భరించలేక బుధవారం పుట్టింటికి వచ్చింది. గురువారం ఉదయం తాను నివాసముంటున్న మూడంస్తుల భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు. సౌజన్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ పీఎస్ సీఐ జి.రాంబాబు పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఆ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి'

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాసిరకం ఫౌండేషన్ సీడ్ అందించిన కార్పొరేట్ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం అధ్యక్షుడు పి. సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగింది. సాగర్ మాట్లాడుతూ ములుగు జిల్లా వెంకటాపురం వాజేడు కన్నాయగూడెం మండలాల్లో నకిలీ మొక్కజొన్న ఫౌండేషన్ సీడ్ వల్ల నష్టపోయిన రైతులకు కార్పొరేట్ విత్తన కంపెనీల నుంచి పరిహారం ఇప్పించాలన్నారు. విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం నేతలు మల్లారెడ్డి, చంద్రారెడ్డి, జంగారెడ్డి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

'మైసయ్యగౌడ్ సేవలు మరువలేనివి'



అన్నదానంలో బీజేపీ నేత రాహుల్, కిరణ్ తదితరులు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతం కోసం దివంగత బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుండగోని మైసయ్యగౌడ్ చేసిన సేవలు మరువలేనివని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తనయుడు బీజేపీ నేత కోవా రాహుల్ పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో దివంగత మైసయ్యగౌడ్ 26వ వర్ధంతి కార్యక్రమం బీజేవైఎం రాష్ట్ర మీడియా మాజీ ఇన్‌చార్జి గాజుల కిరణ్ ఆధ్వర్యంలో జరిగింది. దివంగత మైసయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ప్రారంభించి ప్రసంగించారు. గౌడ్ చేసిన సేవలను పార్టీ మరచిపోదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘువీర్, ఉపేందర్, జి.వెంకటేష్, సాయికృష్ణయాదవ్, భరత్‌భూషణ్, మేకల సారంగపాణి, నవీన్‌గౌడ్, విజయ్‌కుమార్, మంగళ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

30 నుంచి ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహిస్తున్నామని ఈవో మాచర్ల దేవనాథం, రెనోవేషన్ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ, ఈనెల 30న పంచాంగ శ్రవణం, ఏప్రిల్ 1న లక్ష్మీగణపతి హోమం, 2న లక్ష్మీదేవి హోమం, 4న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, 6న సీతారామకల్యాణమహోత్సవం, 7న శ్రీరామపట్టాభిషేకం, 8న హనుమత్‌కార్యసిద్ధిహోమం, 9న సుదర్శనహోమం, 10న రామతారకహోమం, 11న చండీహోమం, 12న హనుమాన్ జయంతి, 14న సీతారాముల రథోత్సవం, కోలాటం, అన్నసమారాధన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వార్షికోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

యాక్టింగ్‌లో స్కిల్స్ నేర్చుకోండి



యాక్టింగ్ శిక్షణ కేంద్రంలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థల విద్యార్థులు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి : విద్యార్థులు విద్యతో పాటు ఇతర కళల పట్ల రాణించాలని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్ సూచించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థలు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్, తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో యాక్టింగ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నటన పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ నెల రోజు పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కల్చరల్ కో-ఆర్డినేటర్ సుంకరి నవీన్, మాస్టర్ ట్రైనర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

2న బీసీ పోరుగర్జన



మాట్లాడుతున్న బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీసీల డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 2న చలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ పోరుగర్జన నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం.. బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయమన్నారు. 9వ షెడ్యూల్‌లో చేసి చట్టం చేయాలని ఢిల్లీలో బీసీ కుల సంఘాలతో కలిసి పోరుగర్జన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీసీ సంఘాల నాయకులు, కులాల నేతలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. వెంకన్నగౌడ్, జి.విజయ్‌కుమార్‌గౌడ్, జి. వెంకటేష్‌గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, వి.నాగభూషణం, నాగేష్‌గౌడ్, పి.ఐలన్‌గౌడ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో పీఅండ్‌టీ కాలనీ క్వార్టర్లు

- 200 క్వార్టర్స్‌లో 50 వరకు..
- విషపురుగులు, కీటకాల సంచారం
- ఆధునికీకరించాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పీఅండ్‌టీ క్వార్టర్స్ భవనం

చిక్కడపల్లి పీఅండ్‌టీ కాలనీలోని చాలా ఇళ్లు శిథిలస్థితికి చేరాయి. ఏళ్లుగా పలు క్వార్టర్లు ఖాళీగా ఉన్నా.. పట్టించుకునే నాథుడు లేడు. నాడు కళకళలాడితే ఇప్పుడు నివాస కుటుంబాలు లేక కళావిహీనంగా కనిపిస్తున్నాయి. జనసంచారం లేకపోవడంతో విష పురుగులు సంచారిస్తున్నాయి.

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రెండు వందల క్వార్టర్లు ఉండగా అందులో యాభై పీఅండ్‌టీ క్వార్టర్లు వరకు ఖాళీగా ఉన్నాయి. పీఅండ్‌టీ శాఖలో ఉద్యోగం చేసేవారికి క్వార్టర్లు కేటాయిస్తుంటారు. అయితే వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం పక్కనున్న క్వార్టర్లలోనే బీఎస్ఎన్ఎల్ కార్యాలయం కూడా కొనసాగేది. దాన్ని.. అక్కడి నుంచి తరలించారు. ఇప్పుడు ఈ ప్రాంతంతో చెత్తాచెదారాలతో నిండి, పురుగు పుట్రా చేరుతున్నాయి. అప్పటికే కొన్ని ఇళ్లు కూలిపోతుండడంతో పాటు రెండు సార్లు కూడా పాములు అందులో నుంచి బయటకు వచ్చాయి. దీంతో ఆంజనేయస్వామి ఆలయం పక్కనున్న పీఅండ్‌టీ క్వార్టర్ల వద్ద నుంచి రాత్రివేళ ఏ విషపురుగు వస్తుందోనని ప్రజలు అటు వైపు తిరగడం మానేశారు.

- వివేక్‌నగర్ హనుమాన్ ఆలయం ఎదుటి వీధిలో ఓ ఇంటి పూలమొక్కల మధ్యలో పామును స్థానికులు గుర్తిస్తే అఖిల్ స్నేక్ క్యాచర్స్ చేరుకుని పట్టుకున్నారు. మరో పాము ఉమెన్స్ హాస్టల్ వార్డెన్ బైక్ పెట్రోల్ ట్యాంక్ కింద దూరగా కర్రతో అదిలించగా క్వార్టర్ల వైపునకు జారుకుంది.

ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు కల్పించుకుని ఖాళీ అయిపోయిన క్వార్టర్లను పూర్తిగా తొలగించాలని లేదా ఆధునికీకరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులతో మరోసారి మాట్లాడతా



చిక్కడపల్లి పీఅండ్‌టీ కాలనీలో ఖాళీ అయిపోయిన క్వార్టర్లు శిథిలస్థితికి చేరడంతో వాటిలో విష పురుగులు, పాములు చేరుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. జననివాసాల మధ్య ఇవి సంచరించడం ఆందోళన కలిగించే విషయమని పీఅండ్‌టీ అధికారులకు సూచించాను. అలాగా శిథిలస్థితికి చేరిన క్వార్టర్ల విషయం పట్టించుకుని చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించా. విద్యానగర్, ఆర్టీసీ బస్‌డిపో 1 వెనుకవైపు ఉన్న క్వార్టర్లలోనుంచి కూడా విష పురుగులు వస్తున్నాయని సమాచారం ఉంది. శిథిలస్థితికి చేరిన క్వార్టర్లను పూర్తిగా తొలగిస్తారా? లేక మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తెస్తారా? అనే విషయాన్ని అధికారులతో మరోసారి మాట్లాడతాను.

ముఠా గోపాల్, ఎమ్మెల్యే

బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి

- పలు పార్టీలు, ప్రజా సంఘాల నేతలు
- బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్ష సమావేశం



సదస్సులో అభివాదం చేస్తున్న అజీజ్‌పాషా, అరవింద్ కుమార్ గౌడ్, కోల జనార్దన్, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాలలో బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని పలు పార్టీలు ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బీసీ జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులలో ప్రాతినిత్యం కల్పించాలని హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఓబీసీ డెమొక్రటిక్ జేఏసీ కన్వీనర్ కోల జనార్దన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్తంగా బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మాజీ ఎంపీ అజీజ్‌పాషా మాట్లాడుతూ.. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతోందని సామాజిక న్యాయం సాధించడమే లక్ష్యంగా బీసీలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందేందుకు సీపీఐ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు యాభై శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదిస్తేనే రాజ్యాధికారంలో వాటా దక్కుతుందని అన్నారు. న్యాయవ్యవస్థలో కూడా బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ టి. రాజు మాట్లాడుతూ బీసీల ఉద్యమ ఫలితమే 42శాతం రిజర్వేషన్లు కల్పన అని అన్నారు. సమావేశంలో పలు సంఘాల నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, పొన్నం దేవరాజ్ గౌడ్, మట్టా జయంతి గౌడ్, లత గౌడ, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, నందగోపాల్, చెరుకు రాములు, సత్యంగౌడ్, ఓరుగంటి వెంకటేషం, యాదగిరి, సదానందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ రాంరెడ్డి

ఉద్యమకారుల సంక్షేమానికి బోర్డు

- ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ రాంరెడ్డి

ముషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ ప్రఫుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన 200 గజాల స్థలం, పింఛన్లు, రూ.20లక్షల హెల్త్‌కార్డు, ఈఎస్ఐ సౌకర్యం, ఉచిత బస్సు ప్రయాణం హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ అధ్యక్షుడు మోహన్ బైరాగి, తెలంగాణ డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జేఏసీ కోశాధికారి చంద్రన్న, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, ఉపాధ్యక్షులు సుజాత, స్వరూపారాణి, తెలంగాణ ఉద్యమకారుల అధ్యక్షుడు వేముల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సునీతారావుకు సన్మానం



రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావును రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మాజీ ప్రధానకార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ గురువారం సన్మానించారు. మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపారని అన్నారు. దేశంలోనే తెలంగాణను టాప్‌లో నిలపడం అభినందించదగ్గ విషయమన్నారు.

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

నేడు డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హస్తకళాకారిణి పి. కమలా ప్రసాదరావు సృష్టించిన సహస్రాధిక అద్భుత కళాఖండాలకు నెలవైన హర్ ఆర్ట్ గ్యాలరీపై నిర్మించిన చిత్ర ప్రదర్శన శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుందని గ్యాలరీ చైర్మన్ డా. కె. ధర్మారావు, గ్యాలరీ ముఖ్యులు సత్యనారాయణ తెలిపారు. మహిళాభ్యుదయానికి, మహిళా స్ఫూర్తికి ఆలవాలంగా పేరొందిన ఈ గ్యాలరీ విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా తెలియజేసే ఈ డాక్యుమెంటరీ చిత్రానికి ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు పర్యవేక్షణలో ఎస్ ఎస్ మూర్తి దర్శకత్వం వహించారు. డా. ధర్మారావు ఈ డాక్యుమెంటరీ చిత్రాన్ని నిర్మించారు.

బస్తీ వాసులకు ఊరట.. నల్లా పునరుద్ధరణ

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దోబీఘాట్‌లో బస్తీవాసుల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ నల్లాను పదిహేనేళ్ల తర్వాత అధికారులు పునరుద్ధరించారు. వాటర్‌బోర్డు అధికారులతో గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ మాట్లాడి గురువారం పబ్లిక్ నల్లా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఉమేశ్, సాయికుమార్, ఆనంద్‌రావు, బస్తీవాసులు మల్లికార్జున్, రమేశ్, నాగరాజు, శోభ, సురేశ్, సంజీవ్, లక్ష్మి, వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బస్తీవాసులతో కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

వైద్య శిబిరాలను వినియోగించుకోండి



ముషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా సూచించారు. సిద్దిక్‌నగర్‌లో ఎస్ఆర్‌డీఎస్‌జీవో సంస్థ, రేయిన్‌బో కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 200మందిని పరీక్షించిన వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు సింధు, పాల్, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, నాయకులు పర్వేజ్ కురేషీ, అజీపాషా, షకీల్ అహ్మద్, ఎస్ఆర్‌డీఎస్‌జీవో సంస్థ ప్రతినిధి ఇందిరాభారతి, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.16.22 లక్షలు

చిక్కడపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి 16,22,154 రూపాయలు హుండీ ఆదాయం వచ్చింది. 63 రోజుల హుండీని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ పర్యవేక్షణలో గురువారం భక్తులు, సిబ్బంది లెక్కించారు. ఇందులో 15 లక్షల కరెన్సీ నోట్లు, 84వేల కాయిన్స్, 27 యూఎస్ డాలర్లు, 50యూరో, 5 యూఏఈ దినార్‌లు ఉన్నాయని ఈవో తెలిపారు.

కానుకల లెక్కింపు

ముషీరా బాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని మహంకాళి ఆలయానికి హుండీ ఆదాయం 41,321 రూపాయలు వచ్చింది. మూడు నెలలుగా భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ ఈవో మహేందర్‌కుమార్, సీఐ అండాలు పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, ప్రధాన అర్చకుడు చంద్రమౌళి, రాము పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్‌లో మరమ్మతు పనులు

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. గురువారం రహ్మత్‌బాగ్ ప్రధాన రోడ్డులో సీవరేజీ పైప్‌లైన్ మ్యాన్‌హోల్ కుంగిపోయిందని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఈ ప్రాంతానికి చేరుకున్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడారు. సిబ్బంది చేరుకొని పనులు చేశారు. డివిజన్‌లోని అన్ని బస్తీలలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, రవియాదవ్, కృష్ణ, సూరి, బాబు, రామకృష్ణ, ఓంప్రకాష్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఇద్దరు ప్రయాణికుల బ్యాగులు చోరీ

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు రైలు ప్రయాణికుల బ్యాగులను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నాంపల్లిలో నివాసం ఉంటున్న అశోక్‌కుమార్‌శర్మ వ్యాపారవేత్త కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 26న ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నాడు. బీదర్ వద్ద బ్యాగును దొంగలు ఎత్తుకెళ్లారు. అందులో 10 గ్రాముల గోల్డ్ చైన్, 1500 నగదు రూపాయలు ఉంది. మరో సంఘటనలో రైలు ప్రయాణికుడి నుంచే బ్యాగును దొంగలు తస్కరించారు. మహారాష్ట్ర ఆకోలకు చెందిన ఫరాగ్‌షప్రీ వృత్తిరీత్యా డాక్టర్. బికనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తుండగా నిజామాబాద్ వద్ద దొంగలు బ్యాగు దొంగలించారు. అందులో 57 వేల రూపాయల నగదు, పాన్‌కార్డు, ఆధార్ కార్డులు ఉన్నాయి. వీరిద్దరూ గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం బీదర్, నిజామాబాద్ రైల్వే పీఎస్‌లకు కేసులు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.



ప్రేమ్‌నగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పాదయాత్ర

అంబర్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలకు ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ గుంతలకు మ్యాన్‌హోల్స్ మూతలను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.